ప్రజాశక్తి

సోమవారం 23 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల

జిఎస్‌టితో దేశానికి లాభం

మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

మాట్లాడుతున్న మాజీ మంత్రి శిద్దా రాఘవరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో వన్ నేషన్ వన్ ట్యాక్స్ విధానంతో అమలులోకి వచ్చిన జిఎస్‌టితో దేశానికి, వ్యాపారులకు లాభం చేకూరిందని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. ఎపి ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్ కుమార్ నేతత్వంలో ఒంగోలు ఆపిల్ హోటల్స్ రిసార్ట్స్‌లో జిఎస్‌టి అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. తొలుత మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పైడా కష్ణ ప్రసాద్, డైరెక్టర్ సుధీర్ కుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం శిద్దా రాఘవరావు మాట్లాడుతూ ఒంగోలు లో ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిఎస్‌టి అవగాహన సదస్సు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. దేశంలో వన్ నేషన్ వన్ ట్యాక్స్ విధానంతో 17 పరోక్ష పన్నులు పోయి 2017 నుంచి జిఎస్‌టి అమలులోకి వచ్చిందన్నారు. జిఎస్‌టి ట్యాక్స్ పేయర్స్ 2017లో సుమారు 90 వేల కోట్లు ఉంటే ప్రస్తుతం 1.50 వేల కోట్లు దాటిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం ఆర్థిక పురోభివద్ధి సాధించిందన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ కష్ణ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, వ్యాపార వర్గాలకు వారధిగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవహరిస్తోందన్నారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ మహిళా ఎంటర్ ప్రెన్యూర్ వింగ్ ఏర్పాటు చేసినట్లు కష్ణ ప్రసాద్ తెలిపారు. ఎంఎస్ఎంఈ పెండింగ్ ఇంటెన్సివ్ సుమారు 942 కోట్లు సిఎం జగన్మోహన్ రెడ్డి విడుదల చేసినట్లు కష్ణ ప్రసాద్ తెలిపారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ డైరెక్టర్ శిద్దా సుధీర్ కుమార్ మాట్లాడుతూ జిఎస్‌టి అవగాహన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన వారందరికి ధన్య వాదాలు తెలిపారు. అనంతరం ప్రముఖ ఆడిటర్ చుండూరు సుధీర్ జిఎస్‌టి సమస్యలపై పలు సందేహాలను నివత్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ సాధించిన విజయాలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఛాంబర్స్ లో సభ్యుడు గా ఉండటంతో కలిగే ప్రయోజనాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాజీమంత్రి శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్ కుమార్‌ను ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూక రించారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ జోన్ నుంచి విజయకుమార్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు శిద్దా హనుమంతరావు, శిద్దా సూర్య ప్రకాశరావు, ఒంగోలు, చీమకుర్తి కి చెందిన గ్రానైట్ పారిశ్రామిక వేత్తలు, ఒంగోలు నగర వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

వైసిపిలో గందరగోళం అంతా ప్రచారమేనా..?

- చీరాలలో పోటీచేయాలని బలరాంకు సిఎం జగన్ చెప్పారన్న బాలినేని
- అద్దంకిలో ఇన్‌ఛార్జి అసమ్మతి వర్గాల ప్రచారంగా నేతల భావన
- టిక్కెట్ల ఖరారు కానందున నేతల్లో పెరుగుతోన్న ఉత్కంఠ

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో నాలుగు రోజులుగా వైసిపిలో సాగుతోన్న పలు వూహాగానాలకు సీనియర్ నేత బాలినేని వ్యాఖ్యలు స్పష్టత నిచ్చాయా? ఇప్పటి వరకూ ఆయా స్థానాల్లో స్పష్టత లేక ఉత్కంఠగా ఉన్న నేతలకు ఆయన మాటలు ఊరట నిచ్చాయా?అనే చర్చ ఇపుడు పార్టీ నేతల్లో మొదలైంది. చీరాల, అద్దంకి స్థానాల విషయంలో నడుస్తోన్న చర్చకు తెరదించేందుకు బాలినేని వ్యూహాత్మకంగానే అడుగులు వేస్తున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. కారణాలే మైనా అధిష్టానం లోని కొందరు పెద్దలను చీరాల ఎమ్మెల్యే కరణం బలరాంతోపాటు ఆయన తనయుడూ కలిశారు. తర్వాత అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరయ్య ఆయన కుమారుడు వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న కృష్ణచైతన్యలూ కలిశారు. ఎందుకు కలిశామనే దానిపై వారు స్పష్టత ఇవ్వలేదు. దీంతో అక్కడ నుంచే గందరగోళం మొదలైంది. పలు ప్రచారాలు తెరపైకి వచ్చాయి. ఎవరిపాత్రవాళ్ళ పోషించారు. పుకార్లు షికార్లు చేశాయి. చీరాలో ఇప్పటికే పోటీకి అన్ని సిద్ధం చేసుకుని ముందుకుపోతోన్న కరణం వెంకటేష్‌కు అక్కడ టిక్కెట్టు రాదనే ప్రచారంతో పాటు ఆయన్ను తిరిగి అద్దంకిలోనే పోటీ చేయాలని సిఎం జగన్ చెప్పారనే ప్రచారం తీవ్రం చేశారు. అంతే కాకుండా అద్దంకిలో పోటీచేసేందుకు సన్నాహాల్లో ఉన్న కృష్ణచైతన్య కూడా ఇక్కడ టిక్కెట్టు రాదనే ప్రచారం కూడా అదే స్థాయిలో జరుగుతోంది. ఇదంతా ఎక్కడ నుంచి వచ్చిందనేదీ నేతలే చెప్పాలి. వాళ్లే స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఈ పరిణామాలపై సీనియర్ నేత మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదివారం పార్టీ కార్యాలయం శంకుస్థాపన సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. వైసిపిలో గందరగోళ పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని మీడియా ప్రతి నిధులు కోరగా అదంతా ప్రచార మేనన్నారు. కావాలనే సృష్టిస్తున్నారని వ్యాఖ్యా నించారు. సిఎం జగన్ స్వయంగా చీరాలలో బలరాంను పోటీచేయాలని చెప్పారని వెల్లడించారు. ఇందులో గందరగోళం ఏమీ లేదన్నారు. బాలినేని వ్యాఖ్యలు అక్కడున్న నేతల్లోనూ చర్చకు దారి తీసింది. చీరాలపై ఆశలు పెట్టుకున్న నేతలకు స్పష్టత వచ్చింది. అదే వేదికపై చీరాల నుంచి టిక్కెట్టు ఆశిస్తోన్న ఎమ్మెల్సీ పోతుల సునీత కూడా ఉన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్‌తోపాటు జిల్లా కో ఆర్డినేటర్ బీదా మస్తాన్‌రావు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌ఛార్జిలూ అందరూ ఇక్కడే ఉన్నారు. అందరిలోనూ బాలినేని మాటలు చర్చకు దారితీశాయి. ఇక్కడ బాలినేని వ్యూహాత్మకం గానే చీరాల విషయాన్ని ప్రస్తావించారని తెలుస్తోంది. ఎందుకంటే చీరాల నుంచి టిడిపి తరపున నుంచి గెలిచిన కరణం బలరాం కొద్ది రోజుల తర్వాత వైసిపిలోకి వచ్చారు. ఈ మార్పు వెనుక సీనియర్ నేత బాలినేని క్రియాశీలక పాత్ర ఉంది. బాలినేని హామీలతోనే కరణం బలరాం తన కుమారుడూ వెంకటేశ్‌లు వైసిపిలో చేరారన్నదీ వాస్తవం. చీరాల టిక్కెట్ కరణం బలరాంకు ఇప్పించేందుకు ఆయన నిర్ణయించుకున్నారు. సిఎం జగన్‌కూ ఇదే చెప్పారు. ఇపుడూ సిఎం జగన్ స్వయంగా బలరాంకు చెప్పారని కూడా వెల్లడించారు. అయితే ఇక్కడ కొద్ది కాలంగా చోటు చేసుకున్న రాజకీయాలకు ఇటీవలే తెరపడింది కూడా. చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ పర్చూరు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టారు. అక్కడకు వెళ్లి పోయారు. చీరాల వీడిపోయారు. అయితే అద్దంకి, చీరాల నియోజకవర్గాల నేతల మధ్య ఇపుడు వాడివేడి పరిణామాలు చోటు చేసుకోవడం ప్రస్తుత చర్చకు కారణంగా భావి స్తున్నారు. అద్దంకిలో కృష్ణచైతన్యకు ▶ 2లో

కానిస్టేబుల్ ప్రాథమిక పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

మండలంలోని ఎండ్లూరు డొంక వద్దనున్న ట్రిబుల్ ఐటీ కళాశాలలో ఆదివారం కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షకు మొత్తం 1040 మంది అభ్యర్థులు హాజరు కావాల్సిఉండగా 962 మంది హాజరయ్యారు. 78 మంది గైర్హాజరయ్యారు. ఈ రాత పరీక్ష ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగింది. స్థానిక ఎస్‌ఐ బి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పరీక్ష కేంద్రం కోఆర్డినేటర్‌గా వై హనుమంతరావు వ్యవహరించగా పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ బి రంగస్వామి వ్యవహరించారు. ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ బి జయరామిరెడ్డి పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

మాతృ హృదయాన్ని చాటిన మహిళా హెడ్ కానిస్టేబుల్..

మండలంలోని ఎండ్లూరు డొంక వద్దనున్న ట్రిబుల్ ఐటీ కళాశాలలో ఆదివారం జరిగిన కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్ష రాయడానికి ఓ మహిళా అభ్యర్థిని తన ఆరు నెలల పాపను తీసుకుని తన భర్తతో వచ్చింది. పాపను తన భర్త వద్ద వదిలి పరీక్ష రాయడానికి లోపలికి వెళ్లింది. ఆమె వెళ్లిన కొద్దిసేపటి తర్వాత ఆ పాప ఏడుపు అధికం కావడంతో ఏమీ చేయలేని పాప తండ్రి డయల్ 112 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీస్ కంట్రోల్ రూమ్ అధికారులు జిల్లా ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్‌ఐ బి శ్రీకాంత్ విధులు నిర్వహిస్తున్న మహిళ హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వరిని ఆ పాప దగ్గరికి తీసుకుని వెళ్లారు. హెడ్ కానిస్టేబుల్ పరమేశ్వరి పాపని తీసుకుని డబ్బా పాలు పట్టి పాపను లాలించింది. దాంతో ఆ పాప ఏడుపాపేసింది.

పాపకు పాలు పడుతున్న మహిళా కానిస్టేబుల్

వైసిపిలో గందరగోళం అంతా ప్రచారమేనా?

(మొదటిపేజీతరువాయి)

అసమ్మతి వర్గంగా ఉన్న నేతలు చేస్తున్న ప్రచారంగా జిల్లా నేతలు భావిస్తున్నారు. చాలా రోజులుగా కృష్ణచైతన్యకు వ్యతిరేకంగా అక్కడ పార్టీలోని కొందరు వేరు శిబిరాలు నడుపుతున్నారు. అధిష్టానం దృష్టికి పలుమార్లు ఫిర్యాదులూ చేశారు. ఇక్కడ గొట్టిపాటిపై కృష్ణచైతన్య పోటీకి తగదనే ప్రచారం తీవ్రం చేశారు. అదే సమయంలో ఇక్కడ కరణం వెంకటేష్‌ను పోటీ చేయించాలనే పట్టుదలతో ఉన్నారు. ఇదే ఆలోచనతో అద్దంకిలో కరణం వెంకటేష్ పోటీ చేస్తారనే ప్రచారం కృష్ణచైతన్య అసమ్మతివర్గం తీవ్ర తరం చేస్తోంది. దీంతో ఈ రెండు నియోజకవర్గాలలో పార్టీలో గందరగోళ పరిస్థితులకు కారణంగా పార్టీ జిల్లా నేతలు భావిస్తున్నారు. ఏదేమైనా చీరాలలో ఎమ్మెల్యే కరణం బలరాంకు సిఎం జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని సీనియర్ నేత బాలినేని వెల్లడించారు. అక్కడ సందిగ్ధం వీడినందున అద్దంకిలో కృష్ణచైతన్యకూ స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ఆయన పోటీకి అధిష్టానం నుంచి ఎలాంటి ఆటంకాలు లేవని విధితమవుతోంది. బాలినేని వ్యాఖ్యలు పార్టీలో నాలుగు రోజులుగా కొనసాగుతోన్న గందరగోళ పరిస్థితికి స్పష్టత ఇచ్చినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు. వీటితోపాటు కనిగిరి, మార్కాపురం, దర్శి, కొండపి, సంతనూతల పాడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు, ఇన్‌ఛార్జిలకు పోటీగా టిక్కెట్లు కోసం మరి కొందరు నేతలు ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో అక్కడ ఎమ్మెల్యేల్లో ఉత్కంఠ కూడా తప్పడం లేదు. పోటీపై వీలైనంత త్వరగా స్పష్టత ఇస్తే బాగుంటుందనే భావనలో ఎమ్మెల్యేలు ఉన్నారు.

విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపట్నంలో విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి-కొత్తపట్నం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కొత్త పట్నం సబ్ స్టేషన్‌లో ఆదివారం విద్యుత్ అదాలత్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కెవిజి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యుత్ సమస్యల పరిష్కారానికి అదాలత్ నిర్వహించామని అన్నారు. విద్యుత్ సమస్యలతో 73 అర్జీలు వచ్చాయని, వాటిలో ప్రధానంగా అధికలోడు సమస్యతో పాటు 47 సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్ మోహన్‌రావు, ఏఎస్‌ఒ సుబ్బారావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదవ మహాసభ అధ్యక్షుడుగా ఏడుకొండలు

ప్రజాశక్తి-పొదిలి

అఖిల భారత యాదవ మహాసభ మార్కాపురం నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడిగా మండల పరిధిలోని రాములవీడు గ్రామానికి చెందిన యేటి ఏడుకొండలును నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు బొట్ల రామారావు యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఏడుకొండలుకు ఆదివారం నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ నాయకులు మందగిరి వెంకటేష్ యాదవ్, మూరబోయిన బాబూరావు యాదవ్, మస్తాన్‌రావు, చిరుమల్లె శ్రీనివాస్ యాదవ్, చిట్టిబోయిన విజయ్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-వేటపాలెం

బాపట్ల జిల్లాలో ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు జరిగాయని, ఇందుకు పటిష్ట బందోబస్తు నిర్వహించామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. ఆదివారం స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. కళాశాలలోని పరీక్షా కేంద్రాలలో కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆయన ఇంజనీరింగ్ కళాశాల ఎంట్రన్స్ గేటు వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా కానిస్టేబుల్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నాయన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీసులు పహారా కాస్తున్నారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. ఇంజనీరింగ్ కళాశాలతో పాటు బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో కూడా పరీక్షా కేంద్రాలను పరిశీలించినట్లు ఈ సందర్భంగా ఆయన మీడియాతో చెప్పారు పరీక్షా కేంద్రాల్లో తనిఖీల సందర్భంగా మీడియా వారిని అనుమతించలేదు. అయితే ఎలాంటి ఐడెంటిటీ కార్డు లేకుండానే, సివిల్ డ్రెస్సుల్లో బైకులపై వచ్చి యథేచ్ఛగా గేటు లోపలికి బయటికి తిరుగుతూ ఉండటాన్ని మీడియా వాళ్ళ గమనించి వారి కెమెరాలకు పని చెప్పారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పీ పి శ్రీకాంత్, కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు, ఇంకొల్లు సిఐ సూర్య నారాయణ, స్పెషల్ బ్రాంచ్ సిఐ అలహరి శ్రీనివాసరావు, పిఆర్‌ఓ చిన్నగంజాం ఎస్‌ఐ కట్ట హనూక్, క్రైమ్ బ్రాంచ్ ఎస్‌కె కమలాకర్ రావు, స్పెషల్ బ్రాంచి కానిస్టేబుల్ నాగరాజు ఉన్నారు.

సెయింట్ ఆన్స్ కాలేజీలో ఎస్‌పి వకుల్ జిందాల్

యుటిఎఫ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ విరాళం

ప్రజాశక్తి-దర్శి

దర్శిలో నూతనంగా నిర్మిస్తున్న యుటిఎఫ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం రూ.50 వేల చెక్కును యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ధనిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఒంగోలులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం ఆదివారం వెంకటరెడ్డికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యంకు ధనిరెడ్డి వెంకటరెడ్డి, యుటిఎఫ్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.


యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటరెడ్డికి విరాళం అందిస్తున్న ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

4న ఆలయంలో వేలం

ప్రజాశక్తి-గిద్దలూరురూరల్

రాచర్ల మండలం జె.పుల్లలచెరువు గ్రామసమీపంలో నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలిసియున్న శ్రీ నెమలిగుండ్ల రంగనాయకస్వామి దేవస్థానం ఆవరణంలో ఫిబ్రవరి 4న బహిరంగ వార్షిక వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ఛైర్మన్ కన్నసాని ఓబులేసు, ఇఒ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆదివారం తెలిపారు. 2023 సంవత్సరం ఉగాది నుంచి 2024 సంవత్సరం ఉగాది వరకు పది ఐటమ్‌లకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, చీరాల వారి కోర్టులో

O.S NO:162/2022

Between :
రావువారి శ్రీనివాసు ...ఫిర్యాది/వాది
వర్సెస్
తన్నీరు వెంకటేశ్వర్లు ....రెస్పాండెంట్ / ప్రతివాది

To
తన్నీరు వెంకటేశ్వర్లు S/o వెంకయ్య
D.NO. 5-207, లక్ష్మీపురం, అక్కాయిపాలెం పంచాయితీ, వేటపాలెం మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు దావాలో నీవు ప్రతివాది వై ఉన్నావు. మాకు కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఎన్నో పర్యాయములు నోటీసులు మరియు దావా సమన్లు పంపియున్నాము. నీవు తీసుకోనకుండా కాలయాపన చేసినందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నోటీసును జారీ చేయడం జరిగినది. తేది: 31-01-2023 న ఉదయం 10.30ని కు స్వయముగా గాని వకీలు వారి ద్వారా గాని హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని ఎడల దావా మీపరోక్షముగా తీర్మానించ బడును.

వాయిదా: 31-01-2023. ఇట్లు
అంబటి పుష్పరాజ్
అడ్వకేట్, చీరాల.
సెల్ నెంబర్ 9391120469.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పొన్నూరు

E.P. NO: 35/2014 in OS NO: 288/2007

Between :
గద్దిపాటి తిరుపతయ్య (died) మరియు ఇతరులు ...DHR'S
V/S
1.పెద్ది మురళి మరియు ఇతరులు
R-2) పెద్ది పూర్ణమ్మ భర్త : late సుబ్బారావు, హిందువు, వయస్సు 60 సం॥లు, గృహిణి, కొండబాల వారి పాలెం పోస్టు, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా.
R-2) పెద్ది పూర్ణమ్మ, భర్త : late సుబ్బారావు C/O దొప్పలపూడి సీతారామయ్య, చింతాయపాలెం పోస్టు, కర్లపాలెం మండలం, బాపట్ల జిల్లా.

పై నెంబరు గల E.P లో మీరు రెండవ ప్రతివాది అయి ఉన్నారు మీకు కోర్టు నుండి ఎన్నిసార్లు నోటీసులు పంపినను, మీరు ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి పంపు చున్నారు. కావున ది : 02-02-2023 తేదీన ఉదయం గం: 10-30 ని॥లకు మీరు స్వయంగా కానీ ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయిన సదరు పై E.P. లో మీ ఆక్షేపణలు తెలుపవలయును. అలా తెలుపు కొని యెడల సదరు E.P. ను పరిహారములను మీకు పరోక్షముగా వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా : 02/02/2023
పొన్నూరు.
23/01/2023

Y.V. RAMESH BABU.
Y. LAKSHMI
ADVOCATES
PONNUR -522124
CELL :9908438430.

అపార్టుమెంట్‌కు చెందిన డాక్యుమెంటు పోయినది

బాపట్ల జిల్లా పర్చూరు మండలం కొమర్నేని వారి పాలెం కుచెందిన మున్నంగి సుభాషిణి D/o చెంచు నాగేశ్వరరావు కి చెందిన డాక్యుమెంట్ 9869/ 2021 నెంబర్ గల డాక్యుమెంటు పోయినది కొమర్నేని వారి పాలెం నుంచి బస్సులో పర్చూరుకు వచ్చుచుండగా బస్సులో పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబర్‌కు గాని మా చిరునామాకు గాని తెలియపరచవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము.

ఇట్లు
మున్నంగి సుభాషిణి, D/o. చెంచు నాగేశ్వరావు కొమర్నేని వారిపాలెం గ్రామము, పర్చూరు మండలం బాపట్ల జిల్లా, సెల్ నెంబర్ 9949001245.

స్థిరాస్తి డాక్యుమెంట్ పోయినది

కోయి శ్రీనివాసరావు, తండ్రి శ్రీరామమూర్తి అను నాకు చెందిన అద్దంకి పట్టణంలోని స్థిరాస్తికి సంబందించిన డాక్యుమెంట్ నెం 1457/2011 ఒరిజినల్ డాక్యుమెంట్ పత్రములు పోయినవి. 15 రోజులు క్రితం జిరాక్స్ నిమిత్తం అద్దంకి బస్ స్టాండ్ సమీపంకు వస్తుండగా ఇవి మార్గ మధ్యలో పోయినవి. దొరికిన వారు సెల్ నెం: 9848835464 కు తెలియజేయగలరు.

PODILI NAGARAPANCHAYAT

e-procurement tender notice Roc.No.115/2021/E1-29, Dt: 28.11.2022

NIT.No. 50/2022-23/PNP (One Work)

15th Finance Commission Tied Grants (2nd Installment) (2020-21)-Rs:4.00 Lakhs

Further Details can be seen at "e-procurement Marketplace in **www.apeprocurement.gov.in** officer inviting bids Commissioner-Podili Nagara Panchayat-Prakasam (Dt), Andhra Pradesh.
Ph No:9494881376

Sd/- Commissioner
Podili Nagara Panchayat

కామన్ విద్యావిధానాన్ని కొనసాగించాలి

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి-పర్చూరు

యుటిఎఫ్ ఆంధ్రప్రదేశ్ పర్చూరు ప్రాంతీయ మండలాల విద్యా సదస్సు పర్చూరులోని అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానంలో వస్తున్న మార్పులతో ఉపాధ్యాయులు నైపుణ్యంతో సిద్ధంగా ఉండాలని కోరారు. ఉపాధ్యాయులు చైతన్యవంతులవటానికి విద్యా సదస్సులు దోహదపడతాయన్నారు. అమెరికా, చైనా లాంటి దేశాలలో ఏ తరగతికి చెందిన వారైనా, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా ఎవరిపిల్లలైనా సరే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విధంగా చట్టం చేసుకున్నారన్నారు. కానీ మన దేశంలో



పర్చూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రహ్మణ్యం

స్థాయిలను బట్టి రకరకాల పాఠశాలల్లో పిల్లలను చదివిస్తున్నారన్నారు. ఈ విధానానికి స్వస్తి పలికి కామన్ స్కూలు విధానాన్ని తీసుకురావాలని సూచించారు. రైతులపై ఈ ప్రభావం కూడా పడుతుందని, తద్వారా రైతు ఆత్మహత్యల వరకు దారితీస్తుందని విఠపు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యారంగంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాల్లో ఎప్పుడూ పర్చూరు ప్రాంతం ముందుంటుందని కొనియాడారు. ఉపాధ్యాయుల ఐక్యత కొనసాగుతుండాలని ఆకాంక్షించారు. తొలుత యుటిఎఫ్ జెండాను విఠపు ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డిని సత్కరించారు. సదస్సులో పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి బాబురెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి, డిప్యూటీ డిఇఒ ఏ కిరణ్‌కుమార్, యుటిఎఫ్ అధ్యక్షులు ఎ శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షులు కెడివి ప్రసాద్, కెవి సుబ్బయ్య, కె కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-మేదరమెట్ల

మృతిచెందిన జయమ్మ

కారు ఢీకొని మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అద్దంకి, ఎన్జీఆర్ కాలనీకి చెందిన అల్లం జయమ్మ(45) అనే మహిళ భిక్షాటన చేస్తూ జీవనం సాగించేది. ఈ క్రమంలో మేదరమెట్ల హైవేపై యాదవ హోటల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఒంగోలు నుంచి గుంటూరు వెళ్లే కారు ఢీకొనటంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను మెరుగైన చికిత్స కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో చనిపోయింది. మేదరమెట్ల ఎస్ఐ ఎంవి శివకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-చీరాల

రైలు నుంచి జారిపడిన ఘటనలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన కె లక్ష్మీనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతికి వెళ్లారు. తిరుగు ప్రయాణం చేసే సమయంలో కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం లక్ష్మీనారాయణ డోర్ వద్ద నిలబడ్డాడు. రైలు చీరాల అగ్నిమాపక కేంద్రం గేటు సమీపానికి రాగానే ప్రమాదవశాత్తూ రైలు నుంచి జారి పడటంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో రైలు కదిలి వెళ్లిపోయింది. స్థానికుల సమాచారం మేరకు క్షతగాత్రుడిని చీరాల 108 సిబ్బంది కత్తి సురేష్, విజయమూరి శ్రీనివాసరావులు ప్రాథమిక చికిత్స చేస్తూ చీరాల ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చారు. హైదరాబాద్ ఫార్మసిస్ట్ కంపెనీలో లక్ష్మీనారాయణ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు న్నారు. సెలవులు తీసుకుని కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి వెళ్లి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

గిడుగు రామమూర్తి నివాళి అర్పిస్తున్న దృశ్యం

వాడుక భాషోద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

గ్రాంథికమ్ము నెత్తిన పిడుగు.. వ్యవహారభాషోద్యమ స్థాపక ఘనుడు గిడుగు అని సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహవర్మ కొనియాడారు. ఆదివారం బాపట్ల సాహితీ భారతి ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి 83వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్మూర్తి గ్రాంథిక భాష స్థానంలో వాడుక భాషను ప్రవేశపెట్టడానికి అహర్నిశలు కృషి చేశారని అన్నారు. నాడు గ్రంథాలు గ్రాంథిక భాషలో ఉండుట కారణంగా విషయ పరిజ్ఞానం పెంపొందించుకునేందుకు చాలా కష్టంగా ఉండేదన్నారు. గ్రంథ రచన వాడుక భాషలో ఉంటే జ్ఞాన సముపార్జన సునాయాసంగా ఉంటుందనే ఉద్దేశంతో గిడుగు రామ్మూర్తి వాడుక భాష ఉద్యమానికి శ్రీకారం చుట్టారని అన్నారు. వారి కృషి ఫలితంగానే నేడు ప్రతి ఒక్కరూ సులువుగా జ్ఞానార్జన చేయగలుగుతున్నారని అన్నారు. కోశాధికారి ఆదం షఫీ మాట్లాడుతూ ఒడిశా, ఉత్తర కోస్తా అడవులలో నివసించే సవర ప్రజల కోసం సవర భాషకు లిపిని, వ్యాకరణాన్ని తయారుచేసి సవర భాష అభివృద్ధికి కూడా గిడుగు వారు కృషి చేశారన్నారు. వారికి బ్రిటిష్ వారు 'రావు సాహెబ్ కైసర్-ఇ-హింద్ బిరుదులను, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ వారు 'కళా ప్రపూర్ణ' బిరుదును ప్రదానం చేశారని పేర్కొన్నారు. వారు "తెలుగు" అనే మాస పత్రిక కూడా స్థాపించారని, వారి జయంతిని "తెలుగు భాషా దినోత్సవం"గా ప్రకటించినట్లు తెలిపారు. ఈ సభలో మర్రి మాల్యాద్రిరావు, ఎన్ కృష్ణ, కీర్తి వెంకయ్య, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డపల్లి శ్రీరామచంద్రమూర్తి, పువ్వాడ వెంకటేశ్వర్లు, రెంటాల మురళి, రాధాకృష్ణమూర్తి, అవ్వారి వెంకటేశ్వర్లు తదితరులు గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులతో అధికారులు

ఎన్‌సిసి క్యాడెట్స్‌కు పరీక్షలు

ప్రజాశక్తి-రేపల్లె

ఆంధ్ర బెటాలియన్ పరిధిలోని ఐదు పాఠశాలలలోని జూనియర్ డివిజన్ ఎన్‌సిసి క్యాడెట్స్‌కు ఏ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ పట్టణంలోని మౌంట్ ఫోర్ట్ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఐలవరం, వెల్లటూరు, పెరవలి, మౌంట్ ఫోర్ట్ పాఠశాలల నుంచి మొత్తం 170 మంది పరీక్షకు హాజరయ్యారు. ఉదయం నుంచి వివిధ రకాల డ్రిల్ టెస్ట్ ప్రామాణిక నియమాలను పాటిస్తూ ఎన్‌సిసి క్యాడెట్స్‌కు రాత పరీక్ష, డ్రిల్ టెస్ట్, వెపన్ ట్రైనింగ్ నిర్వహించారు. 23 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జి కుమార్ పరీక్ష నిర్వహణను పరిశీలించారు. ఎన్‌సిసి అధికారులు ఆంధ్ర బెటాలియన్ తెనాలి నుంచి కల్నల్ ఉమా శంకర్, సుదర్ సోహన్ లాల్, కృషన్ జ్యోతి, హవల్దార్ ముకేష్ కుమార్, జితేంద్ర సింగ్, పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశానికి తరలిన కార్యకర్తలు

ప్రజాశక్తి-సింగరాయపురం

ఒంగోలులో నిర్వహించిన మహాజన సోషలిస్ట్ పార్టీ కార్యవర్గ సమావేశానికి మండల పరిధిలోని మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆదివారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా జెపి రాజ్‌మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మహాజన సోషల్ పార్టీ బలోపేతం చేయటానికి తమ వంతుగా కృషి చేస్తామని తెలిపారు.

ఒంగోలు తరలి వెళ్లిన వారిలో ఎంఆర్‌పిఎస్ నాయకులు సంగటి ఐజాక్ మాదిగ, ఆమోస్‌మాదిగ, అంగల్ కుర్చీ సురేష్‌మాదిగ, సంగాల నవీన్ మాదిగ, అంగలుకు ఆనోక్‌మాదిగ, బలబద్ర రాంబాబు, బలబద్ర శ్రీనివాస్ మాదిగ, బలబద్ర రవిమాదిగ పాల్గొన్నారు.

విద్యార్థినుల అదృశ్యంపై ఆందోళన

ప్రజాశక్తి-పొదిలి

తన కుమార్తె, మరో విద్యార్థిని గత 20 రోజులుగా కనిపించకుండాపోయారని, అయినప్పటికీ పోలీసుల దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదని పొదిలి మండలం మాదిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గోనుగుంట్ల సీయోను ఆదివారం విలేకర్ల ఎదుట వాపోయాడు. ఈ నెల3న దర్శిలోని శ్రీ హర్షిని ఒకేషనల్ విద్యా సంస్థ నుంచి తన కుమార్తె, తమ బావమరిది కుమార్తె కనిపించకుండా పోయారన్నారు. ఈ విషయంపై దర్శి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. మర్రిపూడి మండలం పన్నూరు గ్రామానికి చెందిన బేల్దారి కూలీ మన్నం రాజేష్ తండ్రి దేవ సహాయం, మరొకరి ప్రమేయంతో ఇద్దరు విద్యార్థినులను తీసుకెళ్లినట్లు తెలిపారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తమ కుమార్తె, మరో విద్యార్థిని ఆచూకీ కనిపెట్టి తమకు అప్పగించాలని ఆయన కోరారు.

23న లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పొన్నలూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, యువ నాయకులు నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఈ నెల 23న ఘనంగా నిర్వహించనున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు అనుమోలు సాంబశివరావు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నందమూరి తారకరామారావు, దామచర్ల ఆంజనేయులు, మండవ పుల్లయ్య విగ్రహాల దగ్గర కేక్ కట్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు.

వైసిపికి చరమగీతం పాడదాం: కందుల

ప్రజాశక్తి-పొదిలి: వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పొదిలి పట్టణంలోని 20వ వార్డులోని బాప్టిస్టు పాలెం, టైలర్స్ కాలనీ, లక్ష్మిశెట్టిపాలెంలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఇంకెన్నాళ్లు.. ఇన్‌ఛార్జుల పాలన..?

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం, మేజర్ పంచాయతీగా ఉన్న భట్టిప్రోలు కొన్నేళ్లుగా శాశ్వత కార్యదర్శి లేక ఇన్‌ఛార్జుల పాలనలోనే కొనసాగుతోంది. ఉన్న ఇన్‌ఛార్జి కార్యదర్శి జీతాల బిల్లులకు మాత్రమే పనికొస్తారు. మరి మిగిలిన అభివృద్ధి పనుల మాటేమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పాలకవర్గం అధికారపార్టీకి చెందినదే. కానీ రెండు గ్రూపులుగా ఏర్పడటంతో ఏ ఒక్క పని జరిగే పరిస్థితి లేదు. ఫిబ్రవరి 20 నాటికి పాలకవర్గం పదవి రెండేళ్లు పూర్తి కావస్తోంది. కానీ ఏ మాత్రం అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవు. ఒక దశలో బ్లీచింగ్, విద్యుత్ బల్బులు వేసే పరిస్థితి కూడా పంచాయతీకి లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. పాలకవర్గంలో కొందరు కార్యదర్శికి అనుకూలం కాగా మరికొంతమంది సర్పంచ్‌కి అనుకూలంగా ఉన్నారు. ఎవరికి ఎవరు అనుకూలమైనా ప్రజల కనీస అవసరాలు తీర్చాల్సిన బాధ్యత పాలకవర్గంపై ఉంది. ఈ పంచాయతీలో వివిధ రూపాలలో ఏడాదికి దాదాపు కోటి

భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయం

రూపాయలకు పైగా ఆదాయం ఉంది. మండలంలో 15 గ్రామ పంచాయతీలకు ఆదర్శంగా ఉండాల్సిన భట్టిప్రోలు నేడు అందరూ చర్చించుకునే దుస్థితికి చేరింది. సర్పంచ్ చేపట్టే పనులకు కార్యదర్శి వ్యతిరేకం. అలా అని కార్యదర్శి దగ్గరుండి పనులు చేపట్టింది లేదు. సర్పంచ్ కార్యాలయంలో ఉండగా కార్యదర్శి ఆ ప్రాంతానికి కూడా రాడు. సర్పంచ్ వెళ్లిన తరువాత కార్యాలయానికి వచ్చి విజిట్ చేసి వెళ తుంటాడాని సర్పంచ్ ఆరోపణ. సర్పంచ్ చేసే ఏ పనికైనా మాకు తెలియకుండా బిల్లులు చేయరాదని, అలా చేస్తే నీపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని సభ్యుల బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నాయని కార్యదర్శి ఆందోళన. భట్టిప్రోలు పంచాయతీలో ఇంత జరుగుతున్నా స్థానిక శాసన సభ్యులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఒకే పార్టీకి చెందిన మెజారిటీ పాలకవర్గం సభ్యులను పిలిపించి వారి మధ్య నెలకొన్న విభేదాలను తొలగించటానికి మంత్రి నాగార్జునకు అవకాశం ఉన్నా ఎందుకు స్పందించడం లేదని ప్రజలు చర్చించుకొంటున్నారు. మరో మూడేళ్లపాటు పాలనలో కొనసాగాల్సిన పాలకవర్గాన్ని ఇప్పటికైనా గాడిలో పెడితే తప్ప అభివృద్ధి జరిగే పరిస్థితి లేదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అలాగే పంచాయతీలో బయట పార్టీ నాయకుల పెత్తనం తగ్గితేనే పాలన సజావుగా సాగుతుందని చర్చించుకొంటున్నారు. ఆ మేరకు మంత్రి చర్యలు చేపడతారని ఆశిద్దాం.

పేదల సొంతింటి కల నెరవేరేనా?

రూ.కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యమే ● నివాసయోగ్యం కాని భూములతో అగచాట్లు ● ఆందోళనలో లబ్ధిదారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేసి నిరుపేదలకు నివేశన స్థలాలు కేటాయించింది. ఎన్నో ఏళ్లుగా స్థలాల కోసం ఎదురు చూస్తున్న నిరుపేదలకు ఊరట కలిగించింది. కానీ స్థలాల ఎంపిక మాత్రం పేదలకు అనుకూలమైనవిగా లేకపోవటం నిరుత్సాహానికి గురి చేస్తోంది. ఈ ఎంపిక అటు ప్రభుత్వాన్ని ఇటు ప్రజలను మోసం చేసి అధికార పార్టీ నాయకులకు మాత్రం కాసుల వర్షం కురిపించింది. అనటంలో అతిశయోక్తి కాదు. భట్టిప్రోలులో సుమారు 32 ఎకరాల భూమిని నివేశన స్థలాల కోసం కొనుగోలు చేశారు. ఒక్కో ఎకరాకు ప్రభుత్వం నుంచి దాదాపు రూ.30 లక్షలకు పైగా వెచ్చించి కొనుగోలు చేసింది. ఇంతవరకు బాగానే ఉంది. కానీ కొనుగోలు చేసిన భూములు మాత్రం నివాసయోగ్యం కానివే. ఈ భూములు భట్టిప్రోలులోనే లోతట్టు ప్రాంతం. పైగా వేసవిలో కూడా మురుగు కూపంలా విలయ తాండవం చేసేవి.కనీసం ఎకరా భూమి పట్టుమని పది లక్షలకు కూడా కొనే నాథుడే లేడు. అలాంటిది ఏకంగా రూ.30 లక్షలు చెల్లించి నాయకులు కొనుగోలు చేయించారు. అయితే ఈ సొమ్ముకు మంచి భూములు లేకకాదు. నాయకులకు కమిషన్లు రావని ఈ భూములు కొన్నారనే ఆరోపణలున్నాయి. ఒక్కో ఎకరాకు ఐదు నుంచి ఏడు లక్షల వరకు కమీషన్లు పుచుకున్నట్లు సాక్షాత్తూ అధికార పార్టీ నాయకులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్ తీవ్రంగా ఆరోపిస్తూ ఈ విషయాన్ని నమోదు చేసి దర్యాప్తునకు పంపించాలని సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

రహదారి లేక ఇరుక్కున్న ఇసుక ట్రాక్టర్

భట్టిప్రోలు జగనన్న కాలనీలో నిలిచిన గృహాలు

వసతుల లేమి.. లబ్ధిదారులపై ఒత్తిడి

మండలంలో కేటాయించిన నివేశన స్థలాలకు ప్రభుత్వం నుంచి కనీస వసతులు లేకుండానే గృహాలు నిర్మించాలని లబ్ధిదారులపై అధికారులు ఒత్తిడి చేస్తున్నారని వాపోతున్నారు. మెరకలు, రహదారులు, నీటి వసతి వంటి సౌకర్యాలు లేకుండాలే గృహాలు ఏవిధంగా నిర్మించాలని ప్రశ్నిస్తున్నారు. ఇచ్చిన భూములు అధిక శాతం మాగాణి భూములు కావటం, వర్షాకాలంలో మోకాటి లోతు నీరు నిల్వ ఉండటంతో ఇప్పటి వరకు ఈ స్థలంలోకి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ చేరే అవకాశం లేకపోవటం లబ్ధిదారులను కలవరపెడుతోంది. చేతిలో ఉన్న సొమ్ముతో బేసిమెంట్ వరకు వేసుకోగలిగామని, బిల్లులు కూడా అందకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లబ్ధిదారులకు తగిన సౌకర్యాలు కల్పించి గృహ నిర్మాణాలకు తోడ్పాటు నందించాలని కోరుతున్నారు.

నేటికీ మట్టి రోడ్లే దర్శనం

నేడు జగనన్న కాలనీలలో సిపిఎం నాయకురాలు రమాదేవి పర్యటన

భట్టిప్రోలు మండలంలో ప్రభుత్వం పేదలకు కేటాయించిన జగనన్న కాలనీలలో సోమవారం సిపిఎం రాష్ట్ర నాయకులు ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి పర్యటిస్తారని పార్టీ మండల కార్యదర్శి జి సుధాకర్, మురుగుడు సత్యనారాయణ తెలిపారు. జగనన్న కాలనీలలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు వారు తెలిపారు. లబ్ధిదారులు గమనించి సమస్యలు రమాదేవి దృష్టికి తీసుకురావాలని వారు కోరారు.

మహిళలపై దాడులను అరికట్టాలని నిరసన

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఢిల్లీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ బాపట్ల పాత బస్టాండ్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి మాట్లాడుతూ దేశంలో అన్ని రంగాల్లోనూ మహిళలు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో వారిని ప్రోత్సహించాల్సిన ప్రభుత్వాలు కనీస రక్షణ కూడా కల్పించడం లేదని, దీనికి నిదర్శనమే మహిళా కమిషన్ చైర్ పర్సన్‌పై దాడి అని అన్నారు. గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో నిందితులను స్వేచ్ఛగా తిరగనివ్వడం బిజెపి ప్రభుత్వం మహిళలకు ఇచ్చే రక్షణ అని విమర్శించారు. రెజ్లర్ మహిళలు ప్రపంచ దేశాల ముందు భారతదేశ జెండాని గర్వంగా ఎగరవేస్తున్న సమయంలో బిజెపి ఎంపీ వారిని లైంగికంగా వేధించడాన్ని చూస్తే బిజెపి మహిళలకు ఇచ్చే గౌరవం ఏంటో అర్థం అవుతోందని అన్నారు. రెజ్లర్ మహిళ‌పై దాడి చేసిన బిజెపి ఎంపీని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం దేశ రాజధానిలో మహిళా రక్షణ కోసం ఏర్పడిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్ స్వాతి మాలివాల్‌పై జరిగిన దాడి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని, ఈ విషయంలో నిందితుడిపై కఠినంగా వ్యవహరించాల్సిన పోలీసులు ప్రభుత్వాలు నామమాత్రపు కేసు పెట్టి రెండు రోజులు గడవక ముందే బెయిల్ ఇవ్వడం అంటే ప్రజాస్వామ్యం ఎటు పోతుందని, మహిళా రక్షణ ఏమవుతుందని ప్రశ్నించారు. గతంలోనూ ఢిల్లీ లాంటి ప్రాంతంలో బాలికలపై జరిగిన అనేక దాడులు జరిగాయని, బిజెపి అనుబంధ సంస్థలకు చెందిన వ్యక్తులే ప్రధాన పాత్రధారులని, ఇటువంటి వారిని శిక్షించాల్సిన పోలీసులు కనీసం కేసులు కూడా నమోదు చేయకపోవడం ఆశ్చర్యకరమైన విషయమని అన్నారు. ఇటువంటి వాటిని మహిళలు, బాలికలు ఖండించాలని అన్నారు. ఆడపిల్లల రక్షణ కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందని, మరింత కఠినమైన చట్టాలు చేసి అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి మనోజ్ కుమార్, సిఐటియు జిల్లా నాయకులు గంగయ్య, శామ్యూల్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కష్ణమోహన్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి రమాదేవి

పూర్వవైభవమే లక్ష్యంగా పనిచేయాలి: ఏలూరి

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

తెలుగుదేశం పార్టీ పూర్వవైభవమే లక్ష్యంగా గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు యువత అహర్నిశలు శ్రమించాలని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇసుకదర్శిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, చిన్నగంజాం మండలంలో నూతనంగా ఎంపికైన తెలుగు యువత కమిటీ సభ్యులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీకి మూలస్తంభాలైన యువత టిడిపికి పూర్వ వైభవం కోసం కృషి చేయాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. అందరితో సమన్వయంగా ముందుకు సాగుతూ పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా తెలుగు యువత చిన్నగంజాం మండల నూతన అధ్యక్ష కార్యదర్శులు ఆశోధి వెంకటరామిరెడ్డి, చల్లా జీవన్‌లతోపాటు నూతన కమిటీ సభ్యులందరినీ ఏలూరి అభినందించారు. ఈ కార్యక్రమంలో చిన్నగంజాం టిడిపి నాయకులు ఊస మల్లికార్జున, కోనూరు అనిల్ కుమార్, గంటా వెంకటనారాయణ, కొనసం శ్రీధర్‌రెడ్డి యల్లావుల శ్రీను,బడుగు బాల సుబ్రహ్మణ్యం, పైనం శివాజీ, కొల్లి సురేష్‌రెడ్డి, షేక్ నబీ కరిముల్లా, వాటుపల్లి ప్రకాశరావు, పైనం హరికృష్ణ, జగన్నాథం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరిని సత్కరిస్తున్న చిన్నగంజాం తెలుగు యువత

తెలుగుదేశం పార్టీలో చేరిక..

చింతకుంట గ్రామం మాజీ వాలంటీర్ విప్పర్ల ప్రేమ్ కుమార్ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో టిడిపి పార్టీలో చేరారు. పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని ఏలూరి కోరారు.

ఇదేం ఖర్మ కార్యక్రమంలో పాల్గొన్న ఎరిక్షన్‌బాబు, మెట్టు శ్రీనివాసరెడ్డి

బి.చెర్లోపల్లిలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి'

ప్రజాశక్తి-పెద్దారవీడు

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం పెద్దారవీడు మండలంలోని బి.చెర్లోపల్లి గ్రామం మరియు ఎస్‌సి పాలెంలో 'ఇదేం ఖర్మ రాష్ట్రానికి' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ ఈ అరాచకపు పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పెద్దారవీడు మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి, నాయకులు ఆకుమల్ల శ్రీనివాసరెడ్డి, జడ్డా రవి, దుగ్గెంపూడి మల్లారెడ్డి, దుగ్గెంపూడి చిన్న కొండారెడ్డి, వెన్నా బోడిరెడ్డి, గోదాపు సత్యంరెడ్డి, లింగాల అబ్రహాం, దండా వెంకటేశ్వరరెడ్డి, అకుమళ్ల వెంకట రామిరెడ్డి, అకుమళ్ల చిన్న యోగి రెడ్డి, వి యోగిరెడ్డి, ఆకుమల్ల వెంకటేశ్వరరెడ్డి, ఆకుమళ్ల సుబ్బారెడ్డి, ఏరువ పేరారెడ్డి, ఏరువా శివరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. స్టేట్, జిల్లా, నియోజకవర్గ, మండల, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1960-68లో చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిసి తమ తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాలను అభివృద్ధి చేయడానికి తమ వంతు కృషి చేద్దామని తీర్మానించారు. పూర్వ విద్యార్థి పాలడుగు పుల్లయ్య అధ్యక్షతన సభ జరిగింది. కార్యక్రమంలో కంచి జయపాల్‌రెడ్డి, ఒంగోలు రిమ్స్ మాజీ డైరెక్టర్ బందెల అంజయ్య, పూర్వ విద్యార్థులు వెంకట్రావు, ఆర్ఎన్ సత్యనారాయణ, బత్తుల అంకయ్య, కాకుమాను సుబ్బారావు, జి రంగనాయకులు జి నరసింహారావు, పాఠశాల హెచ్ఎం పి కోటిరెడ్డి హెచ్ఎం డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే టిజెఆర్‌కు స్వాగతం పలుకుతున్న ప్రజలు

మద్దిపాడులో 'గడప గడపకూ'

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల కేంద్రం మద్దిపాడులో ఆదివారం నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 8-30 గంటలకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమం స్థానిక ఎంఎల్‌ఏ టీజెఆర్ సుధాకర్ బాబు, పోలేరమ్మ గుడి వద్ద నుంచి ప్రతి ఇంటికి వెళ్లి సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు అందుతున్నాయా అని పలకరిస్తూ కదిలారు. ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటూ ముందుకు కదిలారు. గ్రామస్తులు టీజెఆర్ కు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మద్దిరాల వెంకటేశ్వర్లు వైస్ ఎంపీపీలు పి వెంకట్రావు, ఎం విజయలక్ష్మి, ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, జడ్‌పిటీసి తేళ్ల భాగ్యలక్ష్మి, పుల్లారావు, వైసీపీ మండల కన్వీనర్ అప్పారావు, ఎం సంజీవరావు, అనిల్ సంజీవరావు, జి అయన్న అధికారులు ఏపీఎం బి నరేంద్ర కుమార్, ఏపీఒ వాక్యావతి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు

ప్రజాశక్తి-దొనకొండ

గ్రామాల్లో అర్హులైన పేదవారందరికీ ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇవ్వాలని లేకుంటే ఒక్కొక్క పక్కా గృహ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు కోరారు. మండల పరిధిలోని బాదాపురం గ్రామంలోని జగనన్న కాలనీ లేఅవుట్‌ను సిపిఎం బృందం ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేసి 2 సంవత్సరాలు దాటినా నేటికీ లబ్ధిదారులు గృహ నిర్మాణాలకు సిద్ధపడక పోవటానికి కారణం ఏమిటో తెలుసుకోకుండా ఊగిది నాటికి గృహాలు పూర్తి చేస్తామని ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. బాదాపురం గ్రామంలో 293

గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న కంకణాల ఆంజనేయులు

మందికి పట్టాలు ఇవ్వగా ఒక్క ఇంటి నిర్మాణం మాత్రమే పూర్తయినట్లు తెలిపారు. మరో ఆరు ఇళ్లకు స్లాబులు వేసినట్లు తెలిపారు. సాల్ లెవల్‌కు 11, పునాది స్థాయిలో 21 ఇళ్లు ఉన్నట్లు తెలిపారు. 254 మంది గృహాలు నిర్మించుకొనేందుకు ముందుకు రాలేదని తెలిపారు. భవన నిర్మాణ వ్యయం విపరీతంగా పెరగటంతో అప్పులు చేసి ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని వాటిని ఏలా తీర్చాలో అర్థం కాని పరిస్థితిలో లబ్ధిదారులు ఉన్నారన్నారు. జిల్లాలో 95, 891 పక్కా గృహాలు మంజూరైనట్లు తెలిపారు. అందులో 16, 819 గృహాలను వివిధ కారణాలతో నిలుపుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెరుగుతున్న ధరలను దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున నిధులు కేటాయించాలన్నారు. ఇసుక ఉచితంగా, సిమెంట్, ఐరన్ రాయితీపై అందజేయాలని కోరారు. సిపిఎం దర్శి నియోజకవర్గ నాయకుడు రంగారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ఆర్భాటంగా ప్రకటించిన నవరత్నాలు అమలు అస్తవ్యస్తంగా మారిందన్నారు. సిపిఎం దొనకొండ మండల నాయకుడు చిరుపల్లి అంజయ్య మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ పక్కా గృహాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వం తగిన విధంగా స్పందించక పోతే లబ్ధి దారులతో కలిసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కుందుర్తి అనిల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యల పరిష్కారం కోసం..

ప్రజా సంఘాలు ఐక్యం కావాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి

ప్రజాశక్తి-పామూరు

ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంఘాల నాయకులు ఐక్యం కావాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి.కొండారెడ్డి తెలిపారు. స్థానిక వప్పు ఎంకోబురావు మీటింగు హాలులో సిఐటియు మండల అధ్యక్షుడు మస్తాన్ అధ్యక్షతన ప్రజా సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం స్వార్థ రాజకీయాలు పెరిగాయని తెలిపారు. ఉద్యోగులు, కార్మికులపై కక్ష సాధింపు చర్యలు పెరుగుతున్నాయని ఆరోపించారు. గ్రామ సచివాలయ ఉద్యోగులపై వైసిపి నాయకుల ఆంక్షలు విధిస్తూ స్వంత ప్రయోజనాలుగా ఉపయోగించుకోవడం దురదృష్టకరమని ఆరోపించారు. ఉద్యోగులపై మెడపై కత్తి పెట్టి పనులు చేయించడం దుర్మార్గమన్నారు. నేటికీ డిఎస్‌సి ప్రకటించకుండా కొత్త

మాట్లాడుతున్నజివి. కొండారెడ్డి

ఉద్యోగాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం సరైనదికాదన్నారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇచ్చే శక్తిని ప్రభుత్వం కోల్పోతుందని ఆరోపించారు. ఈ సమావేశంలో జెవిపి నాయకులు కె.శంకర్, యుటిఎఫ్ నాయకులు తిరుపతిరెడ్డి, ఉదయ్, ఆవాజ్ నాయకులు గౌస్‌బాషా, సిఐటియు నాయకులు కె. మాల్యాద్రి, షేక్ అల్లాభక్షు, సిహెచ్. వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు భానుమతి, మదారమ్మ, మస్తాన్‌బి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు వీం నారాయణ, ప్రజానాట్యమండలి నాయకుడు మహబూబ్ పీరా పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనలు విరమించుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె. మాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేర రాష్ట్ర ప్రభుత్వం నివాసాలకు, వ్యాపార సంస్థలకు ప్రీపెయిడ్ మీటర్లను, వ్యవ సాయ పంపు సెట్లకు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసే ఆలోచనను విరమించు కోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె. మాబు డిమాండ్ చేశారు. స్థానిక పంగులూరి కృష్ణయ్య భవనంలో సిపిఎం మండల స్థాయి శిక్షణా తరగతులు ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెస్తున్న సంస్కరణలను బిజెపి పాలిత రాష్ట్రాలే వ్యతిరేకిస్తుంటే మన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడానికి పూనుకోవడం దారుణమన్నారు. స్మార్ట్,ప్రీపెయిడ్ ,ట్రూఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై వేల కోట్ల

మాట్లాడుతున్న షేక్ మాబు

రూపాయల భారాలు మోపడం అన్యాయమన్నారు. రెగ్యులేటరీ కమీషన్ అనుమతి లేకుండా ఏకపక్షంగా మీటర్లును కొనుగోలు చేశారన్నారు. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టు కోవాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పూనపాటివెంకటరావు మాట్లాడుతూ సభా, వాక్ స్వాతం త్ర్యాన్ని నిరాకరించే జీవో నెంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పల్లాపల్లి ఆంజ నేయులు, కంకణాల వెంకటేశ్వర్లు, టి. రామారావు, సిపిఎం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతుకలైన

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సమస్యలపై ప్రజా గొంతుకలుగా ప్రశ్నించే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఓ వీరారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య కోరారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబురెడ్డి, పట్టభద్రుల అభ్యర్థి ఎం. వెంకటేశ్వరరెడ్డిని గెలిపించాలని ఆయన కోరారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఎ. నాగయ్య అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకున్న వారందరికీ అభినందనలు తెలిపారు. ఉన్నత విద్యావంతులు, సామాజిక స్పృహ కలిగిన వ్యక్తులు, నిత్యం ప్రజా ఉద్యమాల్లో ఉంటూ, ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తున్న



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు జాలా అంజయ్య

ఉద్యమ అభ్యర్థులైన పి.బాబురెడ్డి, ఎం. వెంకటేశ్వరరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. గత మూడున్నర ఏళ్లగా విద్యారంగంలో అనేక సమస్యలు, సంక్షోభాలు ఎదురయ్యాయని తెలిపారు. యూనివర్సిటీలకు నిధులు, నియామకాలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విలీనాన్ని తీసుకొస్తే కేవలం పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమే చట్టసభల్లో పోరాడారని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయడం కోసం ఔట్ సోర్సింగ్, పార్ట్ టైం, తదితర ఉద్యోగ భద్రత కోసం గౌరవ ప్రదమైన వేతనాలు, సర్వీస్ కోసం ఓ విధానాన్ని ప్రభుత్వం ప్రకటించేలా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బాదరయ్య, ప్రజా సంఘాల నాయకులు షేక్ వలీసాహెబ్, యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎం. శ్రీను, జిల్లా కౌన్సిలర్ పి. రవికుమార్, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రఘురాం, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం. రఫీ, డివిజన్ కార్యదర్శి షేక్ అమీర్‌బాషా, టంగుటూరి సత్యనారాయణ, ఉపాధ్యాయులు, పట్టభద్రులుపాల్గొన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇచ్చిన హామీలు అమలు చేయాలి, నరేంద్ర మోడీ మాట మీద నిలబడాలని డిమాండ్ చేస్తూ వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడం కోసం రైతాంగం పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం అధ్యక్షుడు జిల్లా గాలి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఒంగోలు దక్షిణ బైపాస్ మినీ స్టేడియం నుంచి ఉత్తర బైపాస్ ఏ1 కన్వేషన్ వరకూ భారీ ట్రాక్టర్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వామినాథన్ కమీషన్ చెప్పినట్లు ఉత్పత్తి ఖర్చుకు 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి అమలు చేయాలన్నారు. కేరళ తరహా రైతు రుణ విమోచన చట్టం చేయాలన్నారు. ఓ దపా రైతులు మొత్తం రుణాలను రద్దుచేయాలన్నారు. కేంద్రం తెచ్చిన విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించుకోలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ పంపు సెట్లను మీటర్లు ఏర్పాటును నిలుపుదల చేయాలన్నారు. రైతులకు ఉపయోగపడే విధంగా పంటల బీమా అమలు చేయాన్నారు. లఖింపూర్ ఘటనలో కుట్రదారైన కేంద్రమంత్రి అజయ్ మిశ్రాను తొలగించాలన్నరు. జైలుకు పంపిన అమాయక రైతులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు పోరాటంలో అమరులైన 750 మందికి నష్ట పరిహారం అందజేయలన్నారు. రైతాంగ పోరాటం సందర్భంగా దేశవ్యాప్తంగా అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. మాండూస్ తుఫానులో నష్టపోయిన పొగాకు రైతులకు ఎకరాకు రూ. 25 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. వడ్డీ లేకుండా రుణాలు రీషెడ్యూల్ చేసి తిరిగి లక్ష రూపాయల వడ్డీ లేని రుణం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆహ్వాన పత్రికలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అఖిల భారత యాదవ మహా సంఘం ప్రకాశం జిల్లా స్థాయి సమావేశం ఈనెల 29న మార్కాపురంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు మేకనబోయిన గురు ప్రసాద్ యాదవ్ తెలిపారు. ఈ సమావేశానికి ఒంగోలు నుంచి అధిక సంఖ్యలో యాదవులు హాజరు కావాలని ఆయన కోరారు. స్థానిక పంచాయతీరాజ్ అతిథిగృహంలో కార్యక్రమ ఆహ్వాన పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కాపురం టిటిడి కల్యాణ మండపంలో జరిగే యాదవ సమ్మేళనంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు, కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్, శాసనసభ్యులు పార్థసారధి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, బచ్చల అర్జునుడు, రాజకుర్ల రమేష్, వివిధ పార్టీల్లోని యాదవ ప్రముఖులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి నాయకులు బంకా చిరంజీవి, జాదుల శ్రీనివాస్, అఖిలభారత యాదవ మహా సంఘం నాయకులు పిన్నిక లక్ష్మీ ప్రసాద్ వెంకట్రాజు, వెంకట్ రాజు యాదవ్ పలువురు పాల్గొన్నారు.

అనితపై సమగ్ర విచారణ జరిపించాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రిమ్స్ హాస్పిటల్‌లో ఎజిల్ సెక్యూరిటీ సర్వీసెస్ సూపర్‌వైజర్ అనిత అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలని, వైద్య కళాశాల క్వార్టర్స్ నుంచి ఆమె ఖాళీ చేయించాలని దళిత నాయకులు మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. ఒంగోలు రిమ్స్ లోని ఎజిల్ సెక్యూరిటీ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రైవేట్ ఏజెన్సీలో లేడీ సెక్యూరిటీ గార్డ్స్‌కి సూపర్‌వైజర్‌గా ఉంటున్న అనిత ఎజిల్ గ్రూప్ సంస్థకు తానే ఎమ్‌డినని, తాను చెప్పిందే వినాలని లేడీ సెక్యూరిటీ గార్డులను బెదిరిస్తుందన్నారు. ఆడవాళ్ళ చెప్పుకోలేని కొన్ని విషయాలను తప్పుగా చూపిస్తుందని, వాళ్ళు వాష్ రూమ్‌కి వెళితే మగవారితో ఫోటోలు తీయించి మెమోలు జారీ చేస్తుందన్నారు. ఈ ఘటనలపై అనితపై సమగ్ర విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

విహార యాత్రలో కొత్తపల్లి విద్యార్థులు

యర్రగొండపాలెం : యర్రగొండపాలెం పంచాయతీ పరిధిలోని వై కొత్తపల్లి ఎంపియుపి పాఠశాలకు చెందిన 60మంది విద్యార్థులు ఆరుగ్గురు ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఆదివారం విహార యాత్రకు వెళ్లారు. ఎంఇఒ ఆంజనేయులు జెండా ఊపి విహార యాత్ర బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఇఒ ఆంజనేయులు మాట్లాడుతూ విహార యాత్రల వలన విద్యార్థులు విజ్ఞానంతో పాటు వినోదం, మానసిక ఉల్లాసం పొంది చదువులో చురుగ్గా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు నాయక్, పాఠశాల కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

చీమకుర్తి : అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని ఆదివాసుల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు దేవరకొండ వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక ఏకలవ్యనగర్‌లో సంతనూతలపాడు నియోజకవర్గ ఆదివాసుల ఆత్మీయసభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేరం శ్రీనివాసరావు అధ్యక్షతన సభ నిర్వహించారు. సభలో ఆదివాసుల ఉద్యోగుల సంఘం నూతన డైరీని, క్యాలెండర్‌ను జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ బి.జవహర్ ఆవిష్కరించారు. అనంతరం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గిరిజన విద్యార్థులకు నోట పుస్తకాలు, పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, ఎరుకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎన్‌ఎం కుమార్‌ధర్మ, అఖిలభారత ఆదివాసీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె శ్రీనివాసరావు,ఎస్‌కెబాషా,పి గంగయ్య, రాజసులోచన, బాకాశయ్య, యలమంద, అశోక్, పిన్నిక శ్రీను, శ్రీనివాసరావు, రామకృష్ణ,నాగేశ్వరరావు, హనుమంతరావు, దుర్గయ్య, నాగయ్య, రాంబాబు పాల్గొన్నారు.

వైసిపిలో చేరిక

ఒంగోలు సబర్బన్ : తెలుగుదేశం పార్టీకి చెందిన పలువురు యువకులు, సీనియర్ నాయకులు ఆదివారం వైసిపి పార్టీలో చేరారు. వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ ఆధ్వర్యంలో 25 మంది టిడిపిని వీడి వైసిపిలో చేరారు. వైసిపి జిల్లా కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, బిసిసెల్ నాయకులు గోలి తిరుపతిరావు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

గిద్దలూరు : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని లాన్ టెన్నిస్ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక టెన్నిస్ స్టేడియంలో 10 నుంచి 16 సంవత్సరాల పిల్లలకు నిర్వహిస్తున్న టెన్నిస్ లీగ్ పోటీలను ఆదివారం ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన 5 గురు బాలురు, 5 మంది బాలికలను జిల్లా స్థాయి సిఎం కప్ టెన్నిస్ లీగ్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కడప వంశీదర్ రెడ్డి, డాక్టర్ సిహెచ్. రంగారెడ్డి, జి.వీరరాఘవులు, టెన్నిస్ కోచ్ మురళీ మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు శివప్రసాద్, కోశాధికారి ఖాదర్ బాషా పాల్గొన్నారు.

సచివాలయ కన్వీనర్‌గా సుదర్శన్

పిసిపల్లి : సచివాలయాల మండల కన్వీనర్‌గా మాజీ సర్పంచి శీలం సుదర్శన్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా సుదర్శన్ కనిగిరి ఎమ్మెల్యే బుర్రామధుసూదన్ యాదవ్‌కు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. సుదర్శన్‌కు పిసిపల్లి సొసైటీ అధ్యక్షుడు పోలు జయరామిరెడ్డి, మురుగుమ్మి ఎంపిటిసి, సర్పంచులు చెరుకూరి సతీష్, నలగంగుల సుబ్బరత్నమ్మ, వైసిపి నాయకులు మేకల మాల్యాద్రి, బొడ్డుబోయిన వెంకటేశ్వర్లు, రావి రవి, పులి వెంకటేశ్వరరెడ్డి అభినందనలు తెలిపారు.

పరీక్షా కేంద్రంలో పరిశీలిస్తున్న ఎస్‌పి మల్లిక గర్గ్

కానిస్టేబుల్ ప్రిలిమ్స్ పరీక్షలు ప్రశాంతం

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఎపి స్టేట్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఆదివారం నిర్వహించిన ప్రాథమిక పరీక్షలు ప్రశాంత ముగిసినట్లు ఎస్‌పి మల్లికగర్గ్ తెలిపారు. నగరంలోని పరీక్షా కేంద్రాలను ఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాలలో పోలీసు ప్రాథమిక పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ కోసం ఎస్కార్ట్ ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 22 వేల మంది అభ్యర్థులకు గానూ 20,995 మంది హజరయినట్లు ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి అడ్మిన్ కె.నాగేశ్వరరావు, డిఎస్‌పి నాగరాజు, బి.మరియదాసు పాల్గొన్నారు. **మార్కాపురం రూరల్ :** పోలీసు కానిస్టేబుళ్ల ఎంపిక నిమిత్తం ఆదివారం నిర్వహించిన ప్రాథమిక రాతపరీక్ష ప్రశాంతంగా ముగిసిగింది. మార్కాపురంలో మొత్తం 21 పరీక్ష కేంద్రాలలో 7,841 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. పరీక్ష కేంద్రాలను డిఎస్‌పి డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్, జిల్లా ఆదనపు ఎస్‌పి శ్రీధరరావు పర్యవేక్షించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నేడు ప్రైవేటు పరం చేసి ప్రైవేటు వ్యక్తులకు దారా దత్తం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా గత రెండు సంవత్సరాల నుంచి సిపిఐ, ఎఐటియుసి ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని ఆయన విమర్శించారు. ఈనెల 23, 24 తేదీల్లో ఎఐటియుసి, సిపిఎం ఆధ్వర్యంలో రెవెన్యూ డివిజన్లలో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు చెన్నయ్య, కష్ణగౌడ్, వీర తదితరులు పాల్గొన్నారు.

డాకా పిచ్చిరెడ్డి ముఠాను అరెస్ట్ చేయాలి

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

దళిత విద్యార్థిపై దాడి చేసిన డాకా పిచ్చిరెడ్డి ముఠాని అరెస్టు చేయాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు. స్థానిక సమితి కార్యాలయంలో ఆదివారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో నీలం నాగేంద్రరావు మాట్లాడారు. కొండపి మండలం కె.ఉప్పలపాడు గ్రామంలోని రెడ్ల బజారులో గత నెల 7 రాత్రి, తన అనుమతి లేకుండా జరిగిన నవీన్ కష్టారెడ్డి అనే యువకుడి పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన దళితుల్ని డాకా పిచ్చిరెడ్డి దగ్గరుండి కొట్టించారన్నారు. పుట్టినరోజు వేడుకలకు వెళ్లిన చీమకుర్తి మండలం ఆర్ఎల్. పురం గ్రామానికి చెందిన దళిత విద్యార్థి దుడ్డు జీవన్ తల పగలగొట్టారన్నారు. ఈ ఘటన జరిగి 45 రోజులైనా రెడ్ల ముఠాను అరెస్టు చేయకపోవడం దారుమని తెలిపారు. ఈ సమావేశంలో దారా అంజయ్య, బాధితుడిద కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు పాకల విద్యార్థిని

ప్రజాశక్తి -శింగరాయకొండ

స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు పాకల హైస్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె. శివాజీ తెలిపారు. మార్కాపురం గజ్జలకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఇటీవల నిర్వహించిన అండర్ -17 బాలికల విభాగంలో ప్రతిభ కనబరిచిన కె.విజయలక్ష్మి అనే విద్యార్థి ప్రతిభ చూపి స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పిల్లి హజరత్తయ్య తెలిపారు. ఈనెల 23 నుంచి 25 వరకూ విజయనగరం జిల్లా, నెల్లిమర్ల మండలం అలుగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పాటీల్లో విజయ లక్ష్మి పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విజయలక్ష్మిని పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

సిపిఎస్‌ను రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-కనిగిరి

మాట్లాడుతున్న జివి.కొండారెడ్డి

ఉద్యోగులకు జీతాలు, పింఛనుదారులకు పింఛన్లు ఒకటో తేదీని ఇవ్వకుండా ఆవిషయంపై రాష్ట్రప్రభుత్వం, వైసిపి నాయకులు రాద్ధాంతం చేయటం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి. కొండారెడ్డి విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకుల,ప్రజాసంఘాల నాయకులతో షేక్ ఖాజారహంతుల్లా అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండారెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు సిపిఎస్ రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ ,ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. కనీసవేతనం రూ.26వేలు అమలుచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక,కర్షక,ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలంటే పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కనిగిరి పట్టణ నాయకులు పిసి. కేశవరావు,యుటిఎఫ్ నాయకులు బత్తుల రుష్యేంద్ర,షరీఫ్,రాము, ఐద్వానాయకులు ఎస్‌కె.బషీరా,ప్రసన్న, జెవివి నాయకులు వి.మాలకొండారెడ్డి, జి. శ్రీనివాసులు, డివైఎఫ్ఐ నాయకుడు నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఫెల్లోషిప్ అవార్డు

ప్రజాశక్తి- ఒంగోలు సబర్బన్

డాక్టర్ వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

విజయశ్రీ హాస్పిటల్ గ్యాస్ట్రో మరియు లివర్ కేర్ సెంటర్ అధినేత డాక్టర్ దేవరకొండ వెంకటేశ్వర్లుకు న్యూఢిల్లీ వారు ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ తరుపున ఫెల్లోషిప్ అవార్డు అందజేశారు. డాక్టర్ వెంకటేశ్వర్లు కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ చదివారు. చండీఘర్‌లోని ఐమర్ కళాశాలలో పీజీ పూర్తి చేశారు. అనంతరం గ్యాస్ట్రో ఎంటరాలజీ పూర్తి చేశారు. తమ తాత గారు దేవరకొండ సుబ్బయ్య పేరుతో ఎడ్యేకేషనల్ సొసైటీ ఏర్పాటు చేసి గత 15 సంవత్సరాలుగా జిల్లాలో 250కి పైగా మెడికల్ క్యాంపులు నిర్వహిచి పేద ప్రజలకు ఉచితంగా సేవలు అందించారు. 400కి పైగా అవగాహన సదస్తులు నిర్వహించారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఈ నెల 7న ఫెల్లోషిప్ ఇన్ ఇండియన్ సొసైటీ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ అవార్డు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లును ఒంగోలు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు మణిబాబు, గవర్నమెంట్ మెడికల్ కళాశాల వైద్యులు డాక్టర్ తిరుమలరావు ఆదివారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిశోర్, డాక్టర్ సురేష్, డాక్టర్ ఆమని, డాక్టర్ మానస, పేరం వెంకటేశ్వర్లు, విజయశ్రీ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ వెటరన్ క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

స్థానిక లార్డ్ కష్ణ బ్యాట్మింటన్ అకాడమీలో ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వెటరన్ క్రీడాకారుల ఎంపిక ఉత్సాహంగా జరిగింది. .లార్డ్ కష్ణ బ్యాడ్మింటన్ అకాడమీ ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకష్ణ నేతత్వంలో ప్రకాశం జిల్లా బాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా అద్దంకి మురళీకష్ణ మాట్లాడుతూ 35 సింగిల్స్ విభాగంలో విన్నర్ గా టి.కష్ణ మూర్తి, రన్నర్స్ గా ఆర్.రామిరెడ్డి, డబుల్స్ విభాగంలో విన్నర్ టి.కష్ణ మూర్తి, రన్నర్ ఎం.వాసు ఎంపికయ్యారన్నారు. 35 విమెన్ సింగిల్ విభాగంలో విన్నర్ ఎ.శ్రీలక్ష్మి రన్నర్ ఎన్. నిహారిక, విమెన్ డబుల్స్ విభాగంలో విన్నర్ నిహారిక, రన్నర్ హిమ శిల్ప, మిక్సీడ్ డబుల్స్ విన్నర్ ఎమ్.కష్ణ మూర్తి, ఏ.శ్రీలక్ష్మి ఎంపికయ్యారన్నారు. 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో విన్నర్‌గా ఏ.కష్ణ.మూర్తి, రన్నర్‌గా పి.ఎస్ రహీం, 40 ప్లస్ డబుల్స్ విభాగంలో కష్ణ.మూర్తి, రహీం, 45 ప్లస్ సింగిల్ విన్నర్ నాగేశ్వరరావు, 45 డబుల్స్ నాగేశ్వరరావు, విజయ కష్ణ ఎంపికయ్యారు. 50 సింగిల్ కిషోర్ కుమార్, హరి పురుషోత్తం,50 డబుల్స్‌లో హరి పురుషోత్తం,స్వామి వాసు, 55 సింగిల్స్‌లో వెంకట రెడ్డి,ఆదినారాయణ రెడ్డి, 55 డబుల్ పి.వెంకట రెడ్డి,ఆదినారాయణ రెడ్డి, 60 సింగిల్ ఆర్. కె నాయుడు, శ్రీనివాస మూర్తి, 60 డబుల్ ఆర్.కె.నాయుడు, కష్ణ మూర్తి, ఎంపికయ్యారు. 65 సింగిల్ ఎన్. నాగయ్య, మాధవరావు, 65 డబుల్ రాఘవరావు, నాగయ్య,70 సింగిల్ టి.నాగేశ్వరరావు, నాగిరెడ్డి,70 డబుల్ టి.నాగేశ్వరరావు, నాగిరెడ్డి ఎంపికయ్యారన్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో జరిగే రాష్ట్ర స్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలలో వీరు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా బ్యాట్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి విజయ కష్ణ, కోశాధికారి అశోక్ రెడ్డి నితిన్ రెడ్డి, మురళి, వెంకట సుబ్బారావు, రఘుబాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చదువే ధ్యేయం.. ఉత్తమ ఫలితాలే లక్ష్యం

- పది పరీక్షలకు సిద్ధమవుతున్న చందలూరు హైస్కూలు విద్యార్థులు
- గత ఏడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రణాళిక
- క్రమశిక్షణతో కష్టపడి చదువుతున్న విద్యార్థులు
- విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు

చదువులో నిమగ్నమైై ఉన్న చందలూరు హైస్కూల్ పదో తరగతి విద్యార్థులు

ప్రజాశక్తి-పంగులూరు

అందరిదీ ఒకటే మాట.. ఒకటే ఆశయం.. ఒకటే క్రమశిక్షణ.. ఒకటే పట్టుదల.. అందరిదీ ఒకటే లక్ష్యం. అదే ఈ సంవత్సరం కూడా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని. అదే పట్టుదల ఆ పాఠశాల విద్యార్థుల్లోనూ, ఆ పాఠశాల ఉపాధ్యాయుల్లోనూ ఉంది. అదే దీక్షతో, అదే లక్ష్యంతో విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉపాధ్యాయులు చదువు చెబుతున్నారు. అదే పంగులూరు మండలంలోని చందలూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. మరో కొద్ది రోజుల్లో పదో తరగతి పరీక్షలు జరగనున్న దృష్ట్యా పాఠశాలలో విద్యార్థులంతా సమరానికి "సై" అంటూ క్రమశిక్షణతో చదువుతున్నారు. వారికి మేము కూడా అంటూ ఉపాధ్యాయులు తమ శక్తి మేర సహకరిస్తున్నారు. ఏప్రిల్ నెల మూడో తేదీ నుంచి 18వ తేదీ వరకు, పదో తరగతి కామన్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా ఆ పాఠశాలను 'ప్రజాశక్తి' పరిశీలించింది. ఈ పాఠశాలలో మొత్తం విద్యార్థులు 486 మంది ఉండగా, మండలం మొత్తం మీద అత్యధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న పాఠశాలగా, చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో 125 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతుండగా, వారిలో 64 మంది ఆడపిల్లలు, 61 మంది మగ పిల్లలు ఉన్నారు. వీరిలో 79 మంది విద్యార్థులు ఇంగ్లీష్ మీడియం చదువుతుండగా, 56 మంది విద్యార్థులు తెలుగు మీడియం చదువుతున్నారు. 'విజయ స్ఫూర్తి'గా పేరుపెట్టి ప్రభుత్వం ఇచ్చిన 52 రోజుల స్టడీ షెడ్యూల్‌ను తూచా తప్పకుండా పాటిస్తూనే పాఠశాలలో, గతంలో ఉన్న రికార్డును పోగొట్టుకోకుండా మరింత ఉన్నతమైన ఫలితాలు సాధించటం కోసం తమ సిబ్బంది మొత్తం కృషి చేస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు 'ప్రజాశక్తి'కి తెలిపారు. గత సంవత్సరం పాఠశాలకు చెందిన పర్చూరి ఉమాభారతి జయలక్ష్మి 589 మార్కులతో తెలుగు మీడియంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిందని, 100 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాస్తే ,100 మంది పాసయ్యారని, 30 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు వచ్చాయని ,13 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీ సీట్లు సాధించారని ఆయన తెలిపారు. ఈ ఫలితాల కన్నా మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకే తామంతా కష్టపడి పనిచేస్తున్నామని శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజు ఉదయం ఒక పరీక్ష, సాయంత్రం ఒక పరీక్ష జరిపి మరుసటిరోజే పేపర్లు దిద్ది, మార్కులు విద్యార్థులకు తెలియజేస్తున్నామని చెప్పారు. పదో తరగతి విద్యార్థులు ఉదయం 8:15 కల్లా పాఠశాలకు రావాలని, సాయంత్రం 5:15 వరకు ప్రత్యేక తరగతులు వారికి నిర్వహిస్తామని చెప్పారు. మండలంలో ఉన్న పాఠశాలలకు చెందిన నలుగురు ప్రధానోపాధ్యాయులు, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లను కలిపి ఒక టీంగా వేశామని, వీరు ప్రతిరోజూ విద్యార్థులు ఎలా చదువుతున్నారు? ఉపాధ్యాయుల విధానం ఎలా ఉంది? విద్యా విధానం ఎలా సాగుతుంది? అనే అంశాలను పరిశీలించి, ప్రతిరోజూ జిల్లా విద్యాశాఖ అధికారికి తెలియజేయాలన్నారు. విద్యార్థులకు నిర్వహించే రోజువారి పరీక్ష పేపరు ప్రతిరోజూ వాట్సాప్‌లో పెడతారని, దాన్ని ప్రింట్ తీసి పరీక్ష నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పటికే పదో తరగతి సిలబస్ మొత్తం పూర్తయినందువలన, విద్యార్థులకు ఎలాంటి సమస్య రాకుండా చేశామని అన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఈ సంవత్సరం సెలవు దినాలు, దసరా సెలవుల్లో ప్రత్యేక క్లాసులు తీసుకున్నామని శ్రీనివాసరావు చెప్పారు. పాఠశాలలో పనిచేసే ఒక్కో టీచర్‌కు 8 మంది విద్యార్థులను బాధ్యతగా ఇచ్చి, ఆ విద్యార్థుల చదువు ఎలా కొనసాగుతుంది. సమయానికి పాఠశాలకు వస్తున్నారా? రోజువారి పరీక్షల్లో మార్కులు ఏ విధంగా వస్తున్నాయి? ఇంటి దగ్గర కూడా చదువుతున్నారా? ఇలాంటి విషయాలు పరిశీలిస్తారని, అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులతో కూడా మాట్లాడి, వారికి కూడా బాధ్యతలను అప్పగిస్తున్నారని శ్రీనివాసరావు తెలిపారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మ శ్రీనివాసరావు

మా పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది కృషి, విద్యార్థుల పట్టుదల కారణంగా పాఠశాలలో గతంలో సాధించిన ఫలితాలు కన్నా ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తామనే నమ్మకం కనిపిస్తోంది. విద్యార్థులంతా పట్టుదల, క్రమశిక్షణతో చదువుతున్నారు. గ్రామస్తుల సహకారం కూడా చాలా ఉంది. తల్లిదండ్రుల ఆశలను, ఆశయాలను నెరవేరుస్తాం. పాఠశాల ప్రతిష్టను కాపాడుతాం.

విద్యార్థుల భవిష్యత్తు మా లక్ష్యం: పోతిని రజిని, తెలుగు టీచర్

మా పాఠశాలలో చదువుకుని వెళ్లిన విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలి అనే లక్ష్యంతో మేము కష్టపడి పనిచేస్తున్నాము. ఉదయం 8 గంటలకే పాఠశాలకు వచ్చి, సాయంత్రం ఇంటికి వెళ్లేసరికి 6 గంటలు అవుతుంది. ఎంత కష్టమైనా వారి భవిష్యత్తు కోసం ఆనందంగా కృషి చేయటానికి మేమంతా సిద్ధంగా ఉన్నాం.

ఉపాధ్యాయుల కష్టానికి ఫలితం సాధిస్తాం: మాదాల సావిత్రి, విద్యార్థిని

ఉపాధ్యాయులంతా మా కోసం చాలా కష్టపడుతున్నారు. వారి కష్టానికి ఫలితం సాధించే విధంగా మేము చదువుతున్నాం. విద్యార్థులంతా పోటీపడి చదువుతున్నారు. ఖచ్చితంగా మా పాఠశాల ప్రతిష్టను, మా ఉపాధ్యాయుల గౌరవాన్ని కాపాడేందుకు కృషి చేస్తున్నాం.

మంచి ఫలితాలు సాధిస్తాం: పాలపర్తి సురేంద్ర, విద్యార్థి

పాఠాల్లో ఏదైనా అర్థం కాకుంటే ఉపాధ్యాయులు పదేపదే చెబుతున్నారు. విద్యార్థులంతా క్రమశిక్షణగా చదువుతున్నారు. ప్రతిరోజూ జరిగే పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్నాను. కామన్ పరీక్షల్లో కూడా మంచి మార్కులు సాధిస్తాననే నమ్మకం నాకుంది.

నేడు వైసీపీ కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు నెహ్రూ కాలనీలో వైసీపీ పర్చూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయానికి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమంచి కోరారు.

బాబావలికి నివాళులర్పిస్తున్న ఏలూరి

బాధితులకు ఏలూరి పరామర్శ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం దేవరపల్లికి చెందిన తెలుగు యువత నాయకులు రావి గోపి చంద్ తండ్రి రావి రత్తయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందటంతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. పర్చూరుకు చెందిన షేక్ బాబావలి మృతి చెందటంతో ఏలూరి నివాళులర్పించారు. ఆయన వెంట కోడూరి శేషబ్రహ్మాచారి, కొల్లా శ్రీనివాసరావు, మక్కెన శేఖర్‌బాబు, షేక్ షంషుద్దీన్, ఎంపిటిసి కాపు రవిచంద్ర, సురేష్, నాగేశ్వరరావు, పూర్ణయ్య తదితరులు ఉన్నారు.

అడుసుమల్లిలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదలకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు నాగభైరు శ్రీనివాసరావు ఆర్థిక సాయంతో మండలంలోని అడుసుమల్లి శబరి గిరిజన వృద్ధాశ్రమంలోని 30 మందికి దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదలకు సేవచేయటంతో రోటరీ ఎప్పుడు ముందుంటుందని కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, నరిశెట్టి విపిన్‌బాబు, కె సుబ్బారావు, పి వెంకటేశ్వర్లు, ఆశ్రమ నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటరావు

విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకట్రావుకు అవార్డు

ప్రజాశక్తి-చీరాల

చీరాల వాసి అయిన విశ్రాంత చిత్రకళోపాధ్యాయుడు కూరపాటి వెంకట్రావు అవార్డు అందుకున్నారు. బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ తరపున వినుకొండలో శనివారం రాత్రి జరిగిన రాష్ట్రస్థాయి మోగా చిత్ర కళా ప్రదర్శనలో వెంకట్రావు చిత్రించిన 'చిత్రానికి చిత్రకళా శేఖర అవార్డును అందజేశారు. జ్ఞాపికను అందించి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు వజ్రగిరి జెస్టిస్, వి బ్యూలా, కోటేష్, వివిధ ప్రాంతాల చిత్రకారులు పాల్గొన్నారు.

నాసిరకంగా 'నాడు నేడు' పనులు

అధికారుల పరిశీలన లోపభూయిష్టం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వం విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు పాఠశాలల ఆధునీకరణకు నాడు నేడు పేరుతో వేల కోట్లు వెచ్చించి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వీటిలో అవసరమైన చోట నూతన భవనాల నిర్మాణం, ఉన్న భవనాలకు మెరుగులు దిద్ది నూతన బెంచీల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణంతో పాటు గ్రానైట్, విద్యుత్ సౌకర్యం వంటి 10 రకాల సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ఈ నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం రెండో విడత పనులు జరుగుతున్నాయి. ఈ పనులు ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో బిల్లులు మంజూరు, పర్యవేక్షణ చేపడుతుంటారు. ముఖ్యంగా పాఠశాల హెచ్ఎం, గ్రామ స్థాయిలో ఉన్న సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ నిరంతరం అందుబాటులో ఉండి నాణ్యతా ప్రమాణాలు చూడాల్సివుంది. వీరితో పాటు మండల విద్యాశాఖ మరియు ఐకెపి ఏపిఎంలకు ప్రభుత్వం పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించింది. ఇంతమంది పరిశీలకులు ఉన్నప్పటికీ పనులు నాణ్యతాలోపంగానే జరుగుతున్నాయి. కనీస నియమ నిబంధనలు పాటించకుండా గుత్తేదారులు, పాఠశాల హెచ్ఎంలు కుమ్మక్కై పర్సెంటేజీలు పంచుకొనే విధంగా పనులు జరిపిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ కోవకు చెందినదే భట్టిప్రోలు మండలం పెదపులివర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. ఈ పాఠశాలకు 10 సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు సుమారు 60 లక్షలకు పైగా నిధులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 50 శాతం పైగా పనులు పూర్తయ్యాయి. ఫ్లోరింగ్ రిప్లేస్ చేసే పనిలో గ్రానైట్ నిర్మాణానికి ముందుగా 40 ఎంఎం మెటల్‌తో బెడ్ ఏర్పాటు చేసి దానిపై ఇసుకతో గ్రానైట్ పర్చాల్సివుంది. కానీ ఎలాంటి బెడ్ నిర్మాణం లేకుండానే 20ఎంఎం మెటల్ వేసి దానిపై బుసక పరిచి గ్రానైట్ నిర్మిస్తున్నారు. నిరంతరం పాఠశాల హెచ్ఎం పాఠశాలలోనే ఉంటారు. కానీ జరిగే పనులు మాత్రం తనకు సంబంధం లేదు అన్న రీతిలో పట్టీపట్టనట్లు వ్యవహరించటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన పనుల్లో నాణ్యత లోపిస్తే ప్రభుత్వ లక్ష్యం ఏవిధంగా నెరవేరుతుందని ప్రశ్నిస్తున్నారు. ఎప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మండలంలో జరుగుతున్న నాడునేడు పనులపై దృష్టి సారించి పనులు నాణ్యంగా జరిగేవిధంగా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీరాజ్ శాఖ ఏఈ రామచంద్రరావు మాట్లాడుతూ నాడు నేడు పనులు సక్రమంగానే జరుగుతున్నాయని, ఎక్కడైనా నాణ్యత లోపిస్తే అట్టి పరిశీలించి చర్యలు చేపడతామన్నారు.

పెద్దపులివర్రు పాఠశాలలో జరుగుతున్న నాడు నేడు పనులు

వైసిపి కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

జిల్లా కేంద్రమైన ఒంగోలులో వైసిపి జిల్లా కార్యాలయం భవన నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. స్థానిక మినిస్టేడియం పక్కన నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేతల రాకతో ఆప్రాంతమంతా సందడిగా మారింది. రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, రాజ్యసభ సభ్యులు బీదా మస్తాన్‌రావు, వైసిపి జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యేలు కరణం బలరాంకృష్ణమూర్తి, అన్నా రాంబాబు, మద్దిశెట్టి వేణుగోపాల్, కుందురు నాగార్జునరెడ్డి, ఎమ్మెల్సీ పోతుల సునీత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కార్పొరేటర్లు ఈదర వెంకట సురేష్‌బాబు, చింతపల్లి గోపి, ఎఎంసి మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, వైసిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు కటారి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనలో ఎమ్మెల్యే బాలినేని తదితరులు

రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్న 108 ఉద్యోగులు

'108' ఉద్యోగుల సమస్యలు పట్టవా !

- పెండింగ్ సమస్యలపై పోరుబాట
- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- నేడు ప్రభుత్వంతో చర్చలు సఫలమయ్యేనా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

108 ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగులు పోరుబాట పట్టారు. జిల్లా కేంద్రాలలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలతో ప్రభుత్వం సోమవారం చర్చలు జరపనుంది. చర్చలు విఫలమైతే ఏ క్షణమైనా సమ్మెకు వెళతామని 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ నేతలు హెచ్చరిస్తున్నారు. 108 ఉద్యోగుల సమస్యలపై ప్రజాశక్తి ప్రత్యేక కథనం

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 108 అంబులెన్స్ సర్వీసులు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ వాహనాలలో మొత్తం 269 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఇఎంటిలు 153 మంది, పైలెట్లు 116 మంది ఉన్నారు. వీరు గత 20 సంవత్సరాల నుంచి ప్రమాదాలు, ఇతర అనారోగ్య సమస్యలపై అంకిత భావంతో పనిచేస్తున్నారు .వీరిని ప్రభుత్వం పట్టించుకోకపోవడం సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. 108 ఉద్యోగులకు అనుసరిస్తున్న స్లాబ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నారు. ఇఎంటిలకు 1-5 సంవత్సరాలకు రూ.20 వేలు, 5-10 సంవత్సరాలకు రూ.25 వేలు, 10 సంవత్సరాలు పైబడిన వారికి రూ.30 వేలు అందిస్తున్నారు. పైలెట్లకు 1-5 సంవత్సరాలకు రూ.18 వేలు, 5-10 సంవత్సరాలకు రూ.22 వేలు, 10 సంవత్సరాలు పైబడిన వారికి రూ.28 వేలు అందిస్తున్నారు.

ఉద్యోగుల డిమాండ్లు ఇవీ...

- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించాలి
- ఉద్యోగ భద్రత కల్పించాలి
- అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలి
- స్లాబ్ విధానాన్ని ఎత్తివేయాలి
- పిఎఫ్ ,ఇఎస్ఐ యాజమాన్య వాటా వారే చెల్లించాలి
- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ఉద్యోగుల ఆందోళనకు సిఐటియు మద్దతు

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు

108 ఉద్యోగులు పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఉద్యమానికి సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తోంది. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పక్షపాత వైఖరి అవలంబిస్తోంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరుబాటను కొనసాగించాలి.

కండీషన్ వాహనాలు ఇవ్వాలి

- జి.బ్రహ్మరెడ్డి, పైలెట్ ముండ్లమూరు

108 అంబులెన్స్ వాహనాలలో 50 శాతం కండీషన్‌లోని వాహనాలు ఉన్నాయి. వీటిని మరమ్మతులు చేసేందుకు వర్క్ షెడ్ ఉన్నా ఉపయోగం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే పైలెట్‌తో పాటు రోగులకు ఇబ్బంది. కండీషన్‌లో ఉన్న వాహనాలు ఇవ్వాలి

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

భాస్కర్ 108 కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్

ఉన్నత చదువులు చదివిన ఉద్యోగులు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం కోరుతున్నారు. గత నాలుగేళ్ళుగా ప్రభుత్వం సమస్యలు పట్టించుకోవట్లేదు. పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి. సోమవారం జరిగే చర్చలు విఫలమైతే ఏ క్షణమైనా సమ్మెలోకి వెళతాం.

ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకుల కోసం

రూ.1000 కోట్లతో సంక్షేమనిధి ఏర్పాటు చేయాలి

పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

ప్రజాశక్తి-పొదిలి

ప్రైవేట్ స్కూల్స్, కాలేజీలు, విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకుల సంక్షేమ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1000 కోట్ల రూపాయలతో సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని, తూర్పు రాయలసీమ పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పి. బాబు రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్స్ భవనంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి పి. బాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్స్, కాలేజీ లో, విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత, వైద్య సదుపాయం కల్పించి వారికి కూడా హెల్త్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ పి.రమణారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు వి.ఎస్‌కె.రాజేశ్వరరావు, జిల్లా సిపిఎస్ కన్వీనర్ షేక్ అబ్దుల్ హై, ఆడిట్ కమిటీ సభ్యుడు బి.బుజ్జి బాబు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ చవలం వెంకటేశ్వర్లు, పొదిలి తాలూకా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎ. బాదుల్లా, కార్యదర్శి మదర్ వలి, పొదిలి, కొనకనమిట్ల వండలాల యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డి.బాల కాశిరెడ్డి, ఎం.నాగార్జున రావు, బి.కపారావు, గోనే శ్రీనివాసులు కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం నాయకులు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి బాబురెడ్డి

రైతుల అభివృద్ధే లక్ష్యం

- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- మాండూస్ నష్టాలపై ప్రభుత్వానికి తుది నివేదికలు
- కౌలు రైతులు సిసిఆర్ కార్డులు అందజేత
- జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు

ముఖాముఖి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రబీ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించే లక్ష్యంతో తాము పనిచేస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. మాండూస్ తుఫాన్ కారణంగా జిల్లాలో జరిగిన పంట నష్టాలపై ప్రభుత్వానికి తుది నివేదికలు పంపామన్నారు. కౌలు రైతులకు సిసిఆర్‌సి కార్డులు ఇస్తున్నామన్నారు. వారికి అవసరమైన బ్యాంకు రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న రైతులకు రావాల్సిన నష్టపరిహారం పంపిణీకి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలు, వివిధ రాయితీలను గురించి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ముఖాముఖిలో వివరించారు. అవన్నీ ఆయన మాటలల్లోనే...

జిల్లాలో రబీ సీజన్ పంటల సాగు మొదలైంది. 4,29,005 ఎకరాలలో పంటల సాగు లక్ష్యం కాగా 3,25,357 ఎకరాలలో వివిధ పంటలు రైతులు సాగు చేశారు. వరి 1,73,616 ఎకరాలు లక్ష్యం కాగా 1,31,666 ఎకరాలలో సాగు అవుతోంది. జొన్న 9,379 ఎకరాలు లక్ష్యం కాగా 1672 ఎకరాలలో సాగైంది. మొక్కజొన్న 5,096 ఎకరాలు లక్ష్యం కాగా 5,871 ఎకరాల్లో సాగైంది. శనగ 1,49,335 ఎకరాలు లక్ష్యం కాగా 96,045 ఎకరాలలో సాగైంది. మినుములు 22,734 ఎకరాలు లక్ష్యం కాగా 25,650 ఎకరాలలో సాగైంది. అలసందలు 7,662 ఎకరాలు లక్ష్యం కాగా 13,099 ఎకరాలలో సాగైంది. పొగాకు 28,808 ఎకరాలు లక్ష్యం కాగా 22,086 ఎకరాలలో పంట సాగైంది.

25,329 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ

రబీ సీజన్‌లో రైతులు అధికంగా సాగు చేసే శనగ పంటకు విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేశారు. 50,000 క్వింటాళ్ళ శనగ విత్తనాలు కావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు లేఖ రాయగా 29,813 క్వింటాళ్ళు కేటాయించారు. ఇందులో 25,329 క్వింటాళ్ళు రైతులకు పంపిణీ చేశారు. 25 శాతం సబ్సిడీ రాయితీపై జెజె-11, కాక్-2 రకం శనగ విత్తనాలు పంపిణీ చేశాం. 80 శాతం సబ్సిడీపై కాక్-2 2639 క్వింటాళ్ల 3,314 మంది రైతులకు అదజేశాం. జెజె 11 రకం విత్తనాలు 2,025 క్వింటాళ్లు 2,680 మంది రైతులకు పంపిణీ చేశాం.

అందుబాటులో ఎరువులు

రబీ సీజన్‌లో రైతులు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. యూరియా, 20 :20, కాంప్లెక్స్ ఎరువులుఅందుబాటులో ఉంచాం. రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, మార్క్‌ఫెడ్, ఇతర కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

22,073 సిసిఆర్‌సి అందజేత

జిల్లాలో 22,073 మంది రైతులకు సిసిఆర్‌సి(కౌలు సాగు హక్కు పత్రం) కార్డులు అందజేశాం. జిల్లాలో 19,000 ఇవ్వాలన్నది లక్ష్యం కాగా 22 వేల మంది ఇచ్చారు. కలెక్టర్ దినేష్ కుమార్ 61,500 మందికి ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. మండల వ్యవసాయ అధికారులు కౌలు రైతులను గుర్తించే పనిలో ఉన్నారు. 2023 ఖరీఫ్ సీజన్‌లో కౌలు రైతులకు రూ.20 కోట్ల పంట రుణాలను ఇప్పించటం జరిగింది.

ప్రభుత్వానికి మాండూస్ నష్ట నివేదికలు

జిల్లాలో మాండూస్ తుఫాన్ కారణంగా సంభవించిన పంట నష్టం తుది నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశాం. మొత్తం 69,709 ఎకరాలలో మినుమలుఉ, పెసలు, అలసందలు, పత్తి, వరి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. 28,519 మంది రైతులు వారి పంటలను కోల్పోయారు. ఆయా పంటలకు రూ.245.50 కోట్లు నష్టం వాటిల్లింది. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ రైతులకు అందించేందుకు అవకాశముంది. రానున్న కాలంలో జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా అవసరమైన సహాయ, సహకారాలు రైతులకు అందజేస్తాం.